తీరం..అల కల్లోలం



ఇద్దివానిపాలెం వద్ద ముందుకొచ్చిన సముద్రం

కవిటి మండలం ఇద్దివానిపాలెం వద్ద సముద్రం గురువారం అల్లకల్లోలంగా మారింది. ఒక్కో కెరటం 5 మీటర్ల ఎత్తు వరకు లేవడంతో నీరు ఒక్కసారిగా గ్రామంలోని వీధుల్లోకి వచ్చింది. తీరంలో ఉంచిన వలలు, పడవలు చెల్లాచెదురు కావడంతో మత్స్యకారులు భయాందోళనలకు గురయ్యారు. ఇద్దివానిపాలెం, బట్టివానిపాలెం, కర్రివానిపాలెం గ్రామాల వద్ద అలలు తాకిడికి తీరం కోతకు గురైంది. ఇద్దివానిపాలెం వద్ద 25, కర్రివానిపాలెం వద్ద 5 పడవలు బోల్తా పడ్డాయి. పౌర్ణమి నేపథ్యంలో కెరటాలు పోటెత్తడంతో ఇలా జరిగిందని స్థానికులు తెలిపారు. అనంతరం పాటు కావడంతో నీరు యథావిధిగా సముద్రంలోకి వెళ్లిందన్నారు. –న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



బోల్తా పడిన పడవ

చకాచకా పనులు..!

● బిల్లులు మంజూరైతే మరింత వేగవంతం ● కోడిరామ్మూర్తి మైదానంపై క్రీడాకారుల్లో ఆశలు



రెండో అంతస్తు శ్లాబు పూర్తయిన తరువాత..

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి క్రీడా మైదానం పనులు చకచకా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఈ నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవ తీసుకుని గుత్తేదారుతో మాట్లాడి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకున్నారు. పురోగతి కనిపిస్తుండటంతో కోడిరామ్మూర్తి మైదానంపై క్రీడాకారులు ఆశలు పెంచుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

◆ వైకాపా పాలనలో పనులు పూర్తిగా నిలిచిపోవడంతో ఇనుము తుప్పు పట్టింది. ఇంజినీర్ల సూచనల మేరకు రసాయనాలు వినియోగించి దాన్ని తొలగించారు. కింద, మొదటి అంతస్తులో గోడల నిర్మాణం చేపట్టి ప్లాస్టరింగ్ చేశారు. రెండో అంతస్తులో సగభాగం శ్లాబు పూర్తి చేశారు. రెండో వైపు స్తంభాల నిర్మాణం పూర్తయింది.

◆ ఇప్పటివరకు మైదానంలో 65 శాతం పనులు పూర్తయ్యాయి. రెండో అంతస్తులో రెండో సగ భాగం శ్లాబు వేసి రూఫ్ టాప్ నిర్మిస్తే భవన నిర్మాణం పూర్తవుతుంది. విద్యుత్తు, ప్లంబింగ్, శానిటరీ, ఫ్లోరింగ్ తదితర మౌలిక వసతులు పూర్తి చేయాలి. క్రీడకారులకు సంబంధించి వ్యాయామ పరికరాలు, బ్యాడ్మింటన్ కోర్టులు అందుబాటులోకి తీసుకురావాలి. తుది మెరుగులకు సంబంధించిన నమూనాలు రూపొందించే ప్రక్రియ పూర్తయినా అధికారుల చేతికి రాలేదని సమాచారం.

చెల్లింపులకు ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ కోడిరామ్మూర్తి మైదానంలో సమావేశం నిర్వహించి ఏడాది లోపు పనులు పూర్తి చేస్తామని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. పాత గుత్తేదారే కేఆర్ మైదానం పనులను మళ్లీ దక్కించుకున్నారు. ఆయనకు రూ.2.80 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. కొత్తగా మరో రూ.1.60 కోట్ల కొత్త బిల్లులను అధికారులు సిద్ధం చేశారు. సాంకేతిక కారణాల కారణంగా వాటిని అప్‌లోడ్ చేయలేకపోయారు. పెద్ద సంఖ్యలో బిల్లులు పేరుకుపోవడంతో పనులపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. చెల్లింపులకు సంబంధించి ఉన్నతాధికారుల సూచనల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు చొరవ చూపితేనే సకాలంలో పనులు పూర్తవుతాయని క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు.

ఏడాది లోపు పూర్తి..: కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో పనులను పూర్తి చేయడాన్ని కూటమి ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంది. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఏడాదిలోగా పనులు పూర్తి చేసి జిల్లా ప్రజలకు అంకితమిస్తాం. **- గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం**

పుర వీధుల్లో.. నిర్లక్ష్యపు చీకట్లు!

న్యూస్‌టుడే పరిశీలన

☛ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధి కె.టి.రోడ్డులో కాశీబుగ్గ మూడు రహదారుల కూడలి నుంచి పలాస ఇందిరాచౌక్ వరకు సుమారుగా 70 స్తంభాలు ఉండగా 51 వీధి దీపాలు వెలగటం లేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీడిపండు కూడలి వరకు వీధి దీపాల కేబుల్ కాలిపోవడంతో రాత్రి వేళ జంట పట్టణాల వాసులు అంధకారంలో రాకపోకలు సాగిస్తున్నారు.

☛ ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధి పెదాకుల వీధిలో వీధి దీపం కొన్ని నెలలుగా వెలగడం లేదని స్థానికులు ఎన్ని విజ్ఞప్తులు ఇచ్చినా ఫలితం లేదు. ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించడానికి ముగ్గురు సిబ్బంది ఉన్నా చర్యలు శూన్యం.

☛ ఆమదాలవలస పురపాలక సంఘం శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగపోవడంతో చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు.

☛ శ్రీకాకుళం నగరం వన్‌వే ట్రాఫిక్ రహదారిలో 83 స్తంభాలు ఉన్నాయి. ఈ మార్గంలో 7 దీపాలు వెలగడం లేదు. రూ. లక్షలు వ్యయం చేసి పరికరాలు కొనుగోలు చేస్తున్నా నిర్వహణ కొరవడింది.



పలాస కె.టి.రోడ్డులో వెలగని వీధి దీపాలు

పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస పట్టణం, శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే

● నిర్వహణ గాలికొదిలేయడంతో ప్రజలకు తప్పని ఇక్కట్లు
● రాత్రి వేళ ప్రమాదకరంగా రాకపోకలు


నిర్వహణ లోపంతో వీధి దీపాలు వెలగక పట్టణాల్లో అంధకారం నెలకొంటోంది. శ్రీకాకుళం నగరంలోనూ చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. అధికారులు తీసుకుంటున్న తాత్కాలిక చర్యలు ఫలితం ఇవ్వడం లేదు. వైకాపా హయాంలో వీధి దీపాల నిర్వహణను ఇంధన సామర్థ్య సేవల సంస్థ (ఈఈఎస్ఎల్)కు బాధ్యతలు అప్పగించింది. గత ఏడాది అక్టోబరుతో ఒప్పంద గడువు ముగిసింది. పురపాలక సంఘాల పరిధిలో సంవత్సరం పాటు కొత్త ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలు అప్పగించినా నిర్వహణ వ్యవహారంగానే ఉంది. రాత్రి వేళ ప్రజలు చీకట్లో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస పురపాలక సంఘాలు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వీధి దీపాల నిర్వహణపై కథనం.



శ్రీకాకుళం నగరంలో వీధి దీపాలు వెలగని వన్‌వే ట్రాఫిక్ రహదారి

శ్రీకాకుళం శ్రీకాకుళం నగరపాలకసంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఒకటి నుంచి 5 వరకు వీధి దీపాలు కొన్ని నెలలుగా వెలగడం లేదు. రాత్రి వేళ అంధకారం నెలకొని ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల పగలూ వెలుగుతున్నా మరమ్మతులు కరవయ్యాయి. విలీన ప్రాంతాల్లోని కాలనీల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా పని చేయని వీధి దీపాలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పలాస పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయానికి వీధి దీపాల నిర్వహణపై ప్రతిరోజూ ఫిర్యాదులు వస్తున్నాయి. వార్డు సచివాలయ ఎనర్జీ కార్యదర్శులు ఉన్నప్పటికీ వారికి వేరే విధులు అప్పగిస్తుండటంతో పర్యవేక్షణ కొరవడుతోంది. కె.టి. రోడ్డు, కాశీబుగ్గ బస్టాండ్, మండల పరిషత్ కార్యాలయం వీధి, పలు వార్డుల్లో దీపాలు వెలగడం లేదని కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ ఎన్. రామారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూస్తామని తెలిపారు.





ఇచ్ఛాపురం ఇచ్ఛాపురంలో గత నెల నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో వీధి దీపాల సమస్యపై సభ్యులందరూ మాట్లాడి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలలు గడిచినా మరమ్మతులు చేయడం లేదని.. కొన్ని చోట్ల రాత్రి, పగలూ విద్యుత్తు వెలుగుతున్నాయని ఆక్షేపించారు. విద్యుత్తు దుబారా, దీపాల నాణ్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రధాన రహదారి మధ్య దీపాలు వెలిగినా బస్టాండ్, రైలు నిలయం, ఆసుపత్రి తదితర ప్రాంతాలకు రాత్రి వేళ ధైర్యంగా వెళ్లగలమని పట్టణ వాసులు చెబుతున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ నల్లి రమేష్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్య తలెత్తిన వెంటనే సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు.



ఆమదాలవలస నుంచి కుద్దిరాం గ్రామానికి వెళ్లే మార్గంలో అంధకారం

ఆమదాలవలస ఆమదాలవలస పురపాలక సంఘంలోని టి. మన్నయ్యపేట, కె.మన్నయ్యపేట, నారాయణపురం, కంచరవానిపేట, పార్వతీశంపేట, పంతులపేట, జగ్గన్నాథపురం, ఊసవానిపేట తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ బయటకు రాలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ విషయమై పుర కమిషనర్ బాలాజీప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అన్ని వీధుల్లో దీపాలు వెలిగేలా చూస్తామని తెలిపారు.

5 ఇసుక రేవుల టెండర్లు రద్దు



నరసన్నపేట మండలం గోపాలపెంట వద్ద రేవులో ఇసుకను ట్రాక్టర్ ట్రక్కులో వేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

నరసన్నపేట, శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఐదు ఇసుక రేవుల టెండర్లను అధికారులు రద్దు చేశారు. ఇటీవల నివగాం, బట్టేరు, హయాతీనగరం, అంబళ్లవలస, బూరవల్లి, గోపాలపెంట రేవుల నిర్వహణకు టెండర్లు పిలిచారు. నివగాంకు సంబంధించి ఎవరూ ముందుకు రాకపోవడంతో మిగిలిన వాటికి అనుమతులు ఇచ్చారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం బుధవారం వాటిని ప్రారంభించాల్సి ఉంది. పలు కారణాలతో రద్దు చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నరసన్నపేట మండలం గోపాలపెంట వద్ద రేవును గురువారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరో రెండు వారాల్లో జిల్లాలోని 12 ఇసుక రేవులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. అనధికారికంగా తవ్వకాలు చేపడితే కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు. శ్రీకాకుళం ఆర్డీవో ప్రత్యూష, గనుల శాఖ డీడీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు.. అనుమానాలు!

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా కొందరు తూట్లు పొడుస్తున్నారు. రణస్థలం మండలం పైడిభీమవరం వద్ద ఇటీవల కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ నెల 16న రాత్రి జేఆర్‌పురం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తూ విశాఖ వైపు వెళ్తున్న మూడు ఇసుక లారీలను పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని సీఐ కార్యాలయానికి తీసుకొచ్చారు. అవి ఒడిశా నుంచి వస్తున్నాయని.. అనుమతులు ఉన్నాయని సీఐ గురువారం వదిలేశారు. చెక్‌పోస్టు వద్ద పత్రాల తనిఖీకి పకడ్బందీ వ్యవస్థ ఉన్నప్పటికీ జేఆర్‌పురం సీఐ కార్యాలయానికి తీసుకొచ్చి 24 గంటల తరువాత ఒడిశా బిల్లులు ఉన్నాయని తిప్పి పంపేయడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై జేఆర్‌పురం ఎస్సై ఎస్. చిరంజీవి మాట్లాడుతూ అన్ని పత్రాలు ఉండటంతో లారీలను వదిలేశామన్నారు. సీఐ అవతారంను 'న్యూస్‌టుడే' సంప్రదించగా తొలుత అన్ని పత్రాలు ఉన్నాయని చెప్పి.. తరువాత లేవని కేసు నమోదు చేస్తున్నామన్నారు. సీఐ, ఎస్సైలు పొంతన లేని సమాధానాలివ్వడం.. 24 గంటల తరువాత అనుమతి పత్రాలు ఉన్నాయని లారీలను వదిలేయడం చర్చనీయాంశంగా మారింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు



నరసన్నపేట ప్రధాన రహదారిపై మురుగు నీటిలో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

జోరు వాన

శ్రీకాకుళం అర్బన్, నరసన్నపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం జోరు వాన కురిసింది. ఉదయం 8 గంటల వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నరసన్నపేటలో పాత జాతీయ రహదారి (ప్రధాన మార్గం)పై మురుగు, వర్షపు నీరు ఏకమై మోకాళ్ల లోతు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కళాశాల రోడ్డు కూడలి వద్ద పరిస్థితి అధ్వానంగా మారింది. వజ్రపుకొత్తూరులో అత్యధికంగా 21.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొత్తూరులో 9.6 మి.మీ. లావేరు 6.2, గార, రణస్థలం, శ్రీకాకుళం, టెక్కలి, నందిగాం మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.


పుర ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాల్సిందే

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ డిమాండు చేశారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద గురువారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'పురపాలక ఉపాధ్యాయులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోంది. ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికీ సబ్జెక్టు టీచర్లు లేరు. ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి. బోధనేతర సిబ్బందిని నియమించాలి' అని డిమాండు చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, కార్యదర్శి భాస్కరరావు, స్వర్ణకుమారి, సూర్యప్రకాశరావు, చౌదరి రవీంద్ర, జి.గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న యూటీఎఫ్ ప్రతినిధులు

వంశధార ఎస్ఈగా స్వర్ణకుమార్



శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: వంశధార ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీరు (ఎస్ఈ)గా కేవీఎన్ స్వర్ణకుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్ఈగా పని చేస్తున్న బి.రాంబాబును విజయవాడ జలవనరుల శాఖ సీఈ పోస్టులో కొనసాగనున్నారు. వంశధార ప్రాజెక్టు డిప్యూటీ సూపరింటెండెంట్ (డీఎస్ఈ)గా విధులు నిర్వహిస్తున్న స్వర్ణకుమార్‌కు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జలవనరుల శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థిని బలవన్మరణం

పాతపట్నం, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: పాతపట్నం ఏకలవ్య ఆదర్శ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. స్థానికులు, పాఠశాల యాజమాన్యం తెలిపిన వివరాల మేరకు.. పాతపట్నం వైటీసీలో కొనసాగుతున్న ఏకలవ్య ఆదర్శ పాఠశాల (మెళియాపుట్టి)లో సీతంపేట మండలానికి చెందిన బాలిక (12) 7వ తరగతి చదువుతోంది. దసరా సెలవుల అనంతరం గురువారం తల్లితో కలిసి పాఠశాలకు వచ్చింది. వసతిగృహంలో ఉండనని.. ఇంటికి వచ్చేస్తానని ఆమె రోదించింది. తల్లి నచ్చజెప్పడంతో ఉంటానంటూనే నెలాఖరులో మళ్లీ రావాలని కోరింది. మనస్తాపానికి గురైన విద్యార్థిని వసతిగృహం గదిలోకి వెళ్లి జడ రిబ్బన్లతో ఉరేసుకుంది. భోజన విరామ సమయంలో తోటి విద్యార్థిని బాలికను గమనించి సమీపంలో ఉన్న సిబ్బందికి తెలపడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పాఠశాల యాజమాన్యం ఐటీడీఏ అధికారులు, కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసింది. సీతంపేట ఐటీడీఏ డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి, పాతపట్నం సీఐ రామారావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండను తొలిచి.. లేఅవుట్‌గా మలిచి!

రూ.లక్షలు విలువ చేసే కంకర తరలింపు



రూపు కోల్పోయిన నెమలికొండ దిగువ భాగం

న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల పరిధిలోని నెమలికొండ అక్రమార్కుల పరమవుతోంది. దీని చుట్టూ గతంలో పలు ఆక్రమణలు చోటుచేసుకున్న విషయం విదితమే. కొన్ని రోజులుగా నెమలికొండ దిగువ భాగం ముస్లిం కాలనీ వైపు సుమారు 1.40 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కొండను తొలిచి కంకర వ్యాపారం చేసినట్లు స్పష్టమవుతోంది.

◆ నెమలికొండ దిగువన జిరాయితీ సర్వే నంబరు చూపుతూ కొండ భాగాన్ని చదును చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని రోజులుగా రాత్రి వేళ కంకర అక్రమ తవ్వకాలు జరిగాయి. ఇక్కడి నుంచి సుమారు రూ.20 లక్షల విలువ చేసే కంకర తరలించినట్లు సమాచారం. కొండ దిగువ భాగాన్ని యంత్రాలతో తవ్వేశారు. అదే కంకరతో లేఅవుట్‌కు రహదారి ఏర్పాటు చేస్తున్నారు. సూదికొండ సచివాలయం వెనుక ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నా సిబ్బంది స్పందించే పరిస్థితి లేదు.



లోతుగా తవ్విన ప్రాంతం

◆ పలాసకు చెందిన ఓ రైతుకు సమీపంలో జిరాయితీ భూమి ఉండేది. దీనికి సంబంధించి విక్రయాలు జరిగిపోయాయి. తాజాగా అదే జిరాయితీ సర్వే నంబర్‌ను చూపి కొండ దిగువ భాగం ప్రభుత్వ భూమిలో అక్రమాలకు తెర లేపారు. చదును చేసి లేఅవుట్‌గా మార్చిన స్థలం విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ఈ లేఅవుట్‌కు పక్కన ఇప్పటికే సుమారు రెండు ఎకరాల వరకు ప్రభుత్వ భూమి గతంలో అక్రమార్కుల పరమైంది. నిర్మాణాలు సైతం జరిగిపోయాయి. తాజాగా 1.40 ఎకరాల వరకు కొందరు కాజేయాలని పథకం వేశారు.



లేఅవుట్ ప్రాంతానికి ఏర్పాటు చేస్తున్న రహదారి

చర్యలు తీసుకుంటాం..

క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు చోటుచేసుకుంటే ఎంతటి వారైనా ఉపేక్షించబోం. అనుమతులు లేకుండా కంకర రహదారులు నిర్మించకూడదు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- టి.కల్యాణచక్రవర్తి, తహసీల్దారు, పలాస**

భార్య, ప్రియుడిని కడతేర్చి భర్త ఆత్మహత్య

బెంగళూరులో ముగ్గురు జిల్లా వాసుల మృతి


గొల్ల బాబు


లక్ష్మీ పైతమ్మ


గణేశ్ కుమార్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: బెంగళూరులో దారుణం జరిగింది. వివాహేతర సంబంధం జిల్లాకు చెందిన ముగ్గురి ప్రాణాలను బలి తీసుకుంది. భార్య, ప్రియుడిని హత్య చేసిన భర్త.. ఆపై తాను బలవన్మరణానికి పాల్పడ్డాడు. కోణనకుంటె ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కోలు గొల్లబాబు(45), కోలు లక్ష్మీ పైతమ్మ(40) దంపతులు, గణేశ్‌కుమార్ (20) కొన్నేళ్లుగా బెంగళూరు నగరంలో భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తూ.. అక్కడే నివాసముంటున్నారు. వీరు ముగ్గురు కోణనకుంటె సోమేశ్వర లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఒక భవంతిలో ఇటీవల పనికి కుదిరారు. పైతమ్మ, గణేశ్‌ల మధ్య వివాహేతర సంబంధం ఉందని తెలిసి గొల్లబాబు పథకం ప్రకారం బుధవారం అర్ధరాత్రి వారిపై దాడి చేశాడు. కట్టెతో ఇద్దరినీ కొట్టి కడతేర్చాడు. ఆ తర్వాత తెల్లవారుజామున 4 గంటల సమయంలో తన మరదలికి ఫోన్ చేసి సమాచారం అందించి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ లోకేశ్ జగలాసర్ పేర్కొన్నారు.

ప్రాణం తీసిన రహదారి

వాహనం అదుపు తప్పి కానిస్టేబుల్ మృత్యువాత


బుల్లిబాబు (పాతచిత్రం)

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: అధ్వాన రహదారి.. గత ప్రభుత్వ నిర్వాకంతో ఓ పోలీసు కానిస్టేబుల్ నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. విధి నిర్వహణకు వెళ్తున్న కానిస్టేబుల్ రాళ్లు తేలిన మార్గంలో అదుపుతప్పి మృత్యువాత పడిన ఘటన కురుపాం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నీలకంఠరావు వివరాల మేరకు.. పాలకొండ సమీపంలోని గొట్టమంగళపురానికి చెందిన కె.బుల్లిబాబు (48) జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈయన హిరమండలంలో నివాసముంటున్నారు. గురువారం విధుల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎల్విన్‌పేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కురుపాం మండలంలోని జరడ- నీలకంఠాపురం ఘాట్ మార్గంలో అదుపుతప్పి పడిపోయారు. తల రహదారికి బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతదేహాన్ని భద్రగిరి ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు, రేపు ధ్రువపత్రాల పరిశీలన

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి సంబంధించి శుక్ర, శనివారాల్లో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్రశిక్షా ఏపీసీ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. 18న సీఆర్టీ గణితం, భౌతిక శాస్త్రం, పీజీటీ ఆంగ్లం, గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలు, 19న సీఆర్టీ జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, తెలుగుతో పాటు అకౌంటెంట్, వార్డెన్, పార్ట్‌టైం ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తు చేసినవారు శ్రీకాకుళం నగరంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో హాజరుకావాలని చెప్పారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో పాటు రెండు జతల నకళ్లు తీసుకురావాలని సూచించారు.

84 కౌంటర్లలో వంట నూనె విక్రయాలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: బహిరంగ విపణిలో వంట నూనె ధరలు పెరిగినందున సామాన్య ప్రజలకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా వంట నూనె విక్రయిస్తున్నట్లు జేసీ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 84 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లీటర్ పామాయిల్ రూ.110, పొద్దుతిరుగుడు పువ్వు నూనె రూ.124కే అందిస్తున్నామన్నారు. రేషన్ కార్డుదారులకు నెలకు పొద్దుతిరుగుడు పువ్వు నూనె లీటరు, పామాయిల్ మూడు లీటర్లు చొప్పున అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. వినియోగదారులు రేషన్ కార్డు తీసుకుని కౌంటర్ల వద్దకు వెళ్లాలని సూచించారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే కేసు నమోదు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బాలల రక్షిత గృహాల నిర్వహణపై అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 11 కేంద్రాల వివరాలు మాత్రమే నమోదయ్యాయని, 13 రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్నాయని చెప్పారు. అనుమతుల్లేని కేంద్రాలను తక్షణమే మూయించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న కేంద్రాల్లోని పిల్లల్ని ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పించాలని సూచించారు. సీట్ల కేటాయింపునకు సంబంధించి డీఈవో, ఐసీడీఎస్ పీడీ తదితరులతో కమిటీ ఉంటుందన్నారు. బాలలకు సంబంధించి ఫిర్యాదులొస్తే కమిటీకి తెలియజేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఆర్డీవో కె.సాయిప్రత్యూష, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, బాలల రక్షణ అధికారి కె.రమణ, ఆర్ఐవో పి. దుర్గారావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతోనే నష్టనివారణ సాధ్యం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయడం ద్వారా నష్టాలను నివారించవచ్చని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి గురువారం ఆయన సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలువలు, గట్లు, ఇతర మరమ్మతులు ఎక్కడ చేయాల్సిన అవసరం ఉందో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తుపాన్లు, వరదలు వంటి విపత్తుల సమయాల్లో మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, విద్యుత్తు, మున్సిపల్, పంచాయతీరాజ్‌తో పాటు ఇతర శాఖలు కూడా వారి పరిధికి సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేసి పంపాలని సూచించారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా ఉమాదేవి



పాత శ్రీకాకుళంలోని ఉమాజఠలేశ్వరాలయంలో గురువారం ఉమాదేవి శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అశ్వినికుమార్, మహేష్ నిర్వహణలో వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ఆదిత్యుని సేవలో తనికెళ్ల భరణి



అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది వారికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అనివెట్టి మండపంలో ఆశీర్వదించి.. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో వై.భద్రాజీ స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళంనగరం

పిడుగుపాటుతో విద్యుత్తు ఉపకరణాలు దగ్ధం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం దమ్మల వీధిలో గురువారం పిడుగు పడింది. ఆ ప్రాంతంలోని 10 గృహాల్లో విద్యుత్తు ఉపకరణాలతో పాటు రెండు నియంత్రికలు కాలిపోయాయి. విద్యుత్తు శాఖ ఏఈ శివకుమార్ ఆధ్వర్యంలో తాత్కాలికంగా పనులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. కొత్త నియంత్రికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఏఈ చెప్పారు. అధికారులు స్పందించి నష్టపోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని మాజీ సర్పంచి మెండ అప్పారావు కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

23 నుంచి దీక్షారంభ్

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలంలో నైరలోని వ్యవసాయ కళాశాలలో ఈ నెల 23 నుంచి దీక్షారంభ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి గురువారం తెలిపారు. డిగ్రీ మొదటి ఏడాది పాఠ్యప్రణాళికలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నట్లు తెలిపారు. దీక్షారంభ్ కార్యక్రమంలో భాగంగా మొదటి ఏడాదిలో చేరిన విద్యార్థులకు 15 రోజుల పాటు స్థానిక గ్రామాలు, చారిత్రక ప్రాంతాల సందర్శన, తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

చంద్రబాబుకు బుడితి పూర్ణఘటం



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అందజేసేందుకు సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన కంచు, ఇత్తడి కార్మికుడు కింతాడ అప్పారావు 20 రోజులు శ్రమించి నాలుగు కిలోల ఇత్తడి పూర్ణఘటం తయారు చేశారు. దాన్ని అప్పారావు కుమారుడు బుజ్జి బుధవారం శ్రీకాకుళంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు అందజేశారు. సీఎం కార్యాలయానికి పంపించేలా ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ చెప్పారు. బుడితిలోని కంచు, ఇత్తడి కుటీర పరిశ్రమలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించాలనే ఆలోచనతో దీన్ని తయారు చేసినట్లు అప్పారావు, బుజ్జి తెలిపారు. –న్యూస్‌టుడే, సారవకోట

ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు వాయిదా వేయాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సమాఖ్య(ఏపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనీల్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో డిమాండు చేశారు. 1, 2 తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి ఆరురోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసిందని, విద్యా సంవత్సరం మధ్యలో నిర్వహిస్తే బోధన కుంటుపడుతుందన్నారు. రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇస్తుండటంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికీ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, వేసవి సెలవుల్లో శిక్షణ ఇవ్వాలని కోరారు.

నేడు అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతాలు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల పరిధిలో శుక్రవారం సీమంతాలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రాల్లో అన్నప్రాసనలతో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు.

11లోగా ఇంటర్ ఫీజులు చెల్లించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు నవంబరు 11వ తేదీలోగా చెల్లించాలని ఆర్ఐవో పి. దుర్గారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 11వ తేదీలోగా ఎలాంటి అపరాధ రుసుం లేకుండా, రూ.1,000 అపరాధ రుసుంతో నవంబరు 12 నుంచి 20వ తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

తాటి చెట్టుకు మంటలు



సోంపేట మండలం మామిడిపల్లి బీసీ కాలనీ వద్ద 11 కేవీ విద్యుత్తుతీగ గాలివానకు పక్కనే ఉన్న తాటి చెట్టుకి తాకడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. కిందనే ఉన్న ట్రాక్టర్లపై నిప్పురవ్వలు పడకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. లేదంటే భారీ నష్టం వాటిల్లేదని తెలిపారు.
–న్యూస్‌టుడే, సోంపేట

కాబోయే అమ్మకు కష్టం రాకూడదని..!

గర్భిణులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వాతావరణ పరిస్థితుల కారణంగా గర్భిణులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు చర్యలు చేపడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ), ఇతర ఆసుపత్రుల్లో గర్భిణికి 8 నెలలు నిండిన ఎప్పుడు ప్రసవించే అవకాశం తెలియజేస్తూ ఎర్లీ డెలివరీ డేట్(ఈడీడీ) ఇస్తారు. దాని ఆధారంగా జిల్లాలో వారం రోజుల్లో ప్రసవం కానున్న గర్భిణుల వివరాలను సేకరిస్తున్నారు. వర్షాల కారణంగా వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రసవించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇప్పటికే వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 30 మండలాల్లో 71 పీహెచ్‌సీలు, 12 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. వాటి పరిధిలో అక్టోబరు 15వ తేదీ నాటికి 734 మందికి ఈడీడీలు ఇచ్చారు. వారిలో గిరిజన ప్రాంతాల్లో 192 మంది, హైరిస్క్ గర్భిణులు 156 మంది ఉన్నట్లు గుర్తించారు. వారిని సురక్షితంగా ప్రసవానికి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పీహెచ్‌సీలవారీగా వైద్యాధికారులతో పాటు ఎంపీడీవో, రెవెన్యూ సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలను అప్రమత్తం చేశారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నుంచి వారి సమన్వయం చేయనున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ కొద్దిరోజుల్లో ప్రసవించనున్న గర్భిణులకు ఇబ్బందుల్లేకుండా అన్ని ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అన్ని రకాల మందులు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని ఇప్పటికే వైద్యాధికారులను ఆదేశించినట్లు స్పష్టం చేశారు.

నవంబరులో సీపీఎం జిల్లా మహాసభలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పలాస వేదికగా నవంబరు 9, 10వ తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణమూర్తి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సభలకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాసు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. గత కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పన చేయనున్నట్లు వివరించారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు ధరలు తగ్గించాలని, జమిలీ ఎన్నికల నిర్ణయం ఉపసంహరణ, నిరుద్యోగ సమస్య పరిష్కారం, మహిళలపై అత్యాచారాలు అరికట్టాలని డిమాండు చేస్తూ వచ్చే నెలలో ప్రజాహోరు కూడా కార్యక్రమం జరుగుతుందని, వాటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి గోవిందరావు

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

శ్రద్ధగా చదవండి.. ఉన్నత శిఖరాలు అధిరోహించండి


విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కిశోర్‌బాబు

కంచిలి గ్రామీణం: కంచిలి మండల పరిధి జాడుపూడి కస్తూర్బా బాలికా విద్యాలయం, కంచిలిలోని బీసీ బాలుర వసతి గృహాలను జిల్లా అదనపు సెషన్స్ న్యాయమూర్తి కిశోర్‌బాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో అందుతున్న సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పోషకాహారం అందుతున్నది లేనిదీ ఆరా తీశారు. శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట మండలం బారువ గ్రామంలో పాన్‌షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణంలో తినుబండారాలు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న సోంపేట అగ్నిమాపక ఇన్‌ఛార్జి ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. రూ. లక్ష విలువైన సామగ్రి బూడిదైందని బాధితుడు లబోదిబోమంటున్నాడు.

ఇన్‌ఛార్జి ఆర్డీవోగా కృష్ణమూర్తి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస ఇన్‌ఛార్జి ఆర్డీవోగా ఎం.కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం టెక్కలి ఆర్డీవోగా పనిచేస్తున్నారు. ఇక్కడ ఇన్‌ఛార్జిగా పనిచేసిన సుదర్శన దొర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	: 9440437129
పలాస	: 8008574279
కవిటి గ్రామీణం	: 8309638875
పలాస గ్రామీణం	: 7386408926
కంచిలి గ్రామీణం	: 9704568738

సమస్య : కస్పా జాలారి వీధి కాలువ ఇబ్బందికరంగా ఉంది. శిథిలమైన కాలువతో దుర్గంధం భరించలేకపోతున్నాం. -గొర్లె పాపారావు, ఇచ్ఛాపురం
సమాధానం : త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.
-ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం
- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సమస్య : పలాస మండలం కంట్రగాడ కాలనీలో కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం.
-స్థానికులు
సమాధానం: ఈ విషయం మా దృష్టిలో ఉంది. త్వరలోనే డ్రైనేజీ నిర్మించి సమస్య పరిష్కరిస్తాం. -సద్గుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట
-పలాస గ్రామీణం, న్యూస్‌టుడే

విద్యార్థి దశలో జ్ఞాన సముపార్జన అవసరం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో జ్ఞాన సముపార్జన కోసం పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఎంఈవో కురమాన అప్పారావు పేర్కొన్నారు. మండలం పరిధి జగన్నాథపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం వార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులను అడిగి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం ఇస్తున్న జైభీమ్‌సేన ప్రతినిధులు

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట అంగన్‌వాడీ కేంద్రం-1కు వసతులు కల్పించాలని తహసీల్దార్‌కు జైభీమ్‌సేన ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. గురువారం తహసీల్దారును సేన వ్యవస్థాపక అధ్యక్షుడు నగిరి మోహన్‌రావు, అధ్యక్షుడు ఈశ్వరరావు కలిశారు. పీకే వీధి పాఠశాల గదిలో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తుండగా 15 రోజుల క్రితం ఉపాధ్యాయులు గదికి తాళం వేసి చిన్నారులను పంపి వేయడంతో నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు.

సమస్యల సంత.. పట్టించుకోండి రవ్వంత


పూండి వారపు సంతలో ప్రధాన రహదారిపైనే ఏర్పాటు చేసిన దుకాణాలు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే

- పూండి వారపు సంతలో అనధికారిక వసూళ్లు
- ఆశీలు పాట జరగకుండానే సొమ్ము చేసుకుంటున్న దళారులు
- వసతులు లేక ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు

వజ్రపుకొత్తూరు మండలం పూండిలో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంత దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. ఇక్కడ సంతలో వ్యాపారాలు చేసుకునేందుకు పలాస, మందస, సోంపేట, ఒడిశాతోపాటు జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి వ్యాపారం సాగిస్తుంటారు. సంతలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఆశీల పేరిట కొంతమంది అనధికార వసూళ్లకు పాల్పడుతూ.. సొమ్ము చేసుకుంటున్నారు. వసతులు లేక, డబ్బులు కట్టలేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

వేలం పాట జరిగి 6 నెలలు

గతేడాది సంత, పూండిబస్టాండ్ మార్కెట్ ద్వారా రూ.1.50లక్షలకు వేలం పాట జరిగింది. ఈ ఏడాది మార్చితోనే పాట పూర్తయింది. మార్చి చివరిలో పాట వేసి ఏప్రిల్ నుంచి ఆశీలు వసూళ్లు చేయాలి. కానీ 6 నెలలు గడిచినా ఇక్కడ వేలం పాట జరగలేదు. దీంతో అనధికారికంగా అశీల వసూళ్లు చేపడుతున్నారు. ఈ ఆదాయం పంచాయతీకి చేరకుండా దుర్వినియోగమవుతుందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

బురదలోనే విక్రయాలు

రూ.లక్షల్లో వేలం పాటద్వారా పంచాయతీకి ఆదాయం వస్తున్నా ఇక్కడ వ్యాపారస్థులకు నీడనిచ్చే షెడ్లు నిర్మించి తాగునీరు, విద్యుత్తు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా ఆ మేరకు పంచాయతీ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తోంది. మరో వైపు వర్షం పడితే ఇక్కడ వ్యాపారాలు బురదలోనే సాగుతున్నాయి. వ్యాపారస్థులే తాత్కాలిక టెంట్‌లు ఏర్పాటు చేసుకోగా, కొంతమంది తప్పని పరిస్థితిలో మండుటెండలోనే వ్యాపారం సాగిస్తున్నారు. పలువురు చెరకుపల్లి, పూండి బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారులపై వ్యాపారం చేస్తుండటంతో గురువారం వస్తే ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి.

అవస్థలు పడుతున్నాం

వారపుసంతకు ఆశీల పాట ద్వారా ప్రతి ఏటారూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. అధికారులు మాత్రం ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పించడంలేదు. వసతులు కల్పించనప్పుడు అశీలు ఎందుకు వసూళ్లు చేయాలి.
-కె.ధర్మారావు, కూరగాయల వ్యాపారి, పీపీపురం

సౌకర్యాల కల్పనకు కృషి

పూండి వారపుసంతలో సౌకర్యాలు లేని విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. వేలం పాట జరగని విషయమై ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారికి చెప్పాం. పూండి పంచాయతీ కార్యదర్శి కొత్తగా విధుల్లో చేరాల్సి ఉంది. చేరిన వెంటనే వేలం పాటు పూర్తి చేస్తాం.
- డి.తిరుమలరావు, ఈవోపీఆర్డీ, వజ్రపుకొత్తూరు

వాల్మీకికి ఘన నివాళి


ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం విశ్వనాథం

ఆదికవిగా పేరొందిన వాల్మీకి మహర్షి జయంతిని గురువారం కవిటి, మందస, పలాస, ఇచ్ఛాపురంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలను పలు పాఠశాలలోని విద్యార్థులకు తెలియజేసి, రామాయణలోని శ్లోక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.
-న్యూస్‌టుడే, బృందం


మందస: మండల పరిషత్ కార్యాలయంలో..


కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో..

పాకలో వంట.. ఎన్నాళ్లీ తంటా

రాజపురం ఆదర్శ పాఠశాలలో వంటషెడ్ లేక వంట సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. పాఠశాలలో 450 మంది, కళాశాలలో 170 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి రోజు రాగిజావ, మధ్యాహ్న భోజనం, అనంతరం వసతిగృహ విద్యార్థులకు రాత్రి భోజనం తయారీకి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రిన్సిపల్ ఎం. ఈశ్వరరావు వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగిందని, నిధులు వచ్చిన వెంటనే నిర్మిస్తామన్నారు. -న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



ఇళ్ల ముందే మురుగు



పలాస మండలం రంగోయిలోని మెట్ట వీధిలో కాలువలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చెత్త, మురుగునీరు ఇళ్ల ముందే ఉంటోందని, దుర్వాసన వెదజల్లుతోందని చెబుతున్నారు. ఇదే విషయం మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే కాలువలు నిర్మించి సమస్య పరిష్కరిస్తామన్నారు. -న్యూస్‌టుడే, పలాస గ్రామీణం,

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

మందస, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పోరాటాలతోనే సాధ్యమని, అందుకు శక్తి వంచన లేకుండా పాటుపడతానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ పేర్కొన్నారు. మందస, చీపి, కిల్లోయి, పట్టులోగాం, బుడంబొ, చినకోష్టలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, గురుకుల బాలికోన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.


ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

తీర రహదారి పనులు ప్రారంభం



వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు నుంచి సముద్ర తీరానికి వెళ్లే రహదారి అభివృద్ధి పనులను గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. పంచాయతీరాజ్ పర్యవేక్షణలో సుమారు రూ. 90 లక్షల నిధులతో తారురోడ్డు పనులు చేపడుతున్నారు. తొలుత రహదారి విస్తరణలో భాగంగా పొక్లెయిన్‌తో పనికిరాని మొక్కలు, పొదలు తొలగించి శుభ్రం చేశారు. కూటమి ప్రభుత్వంతోనే తీర ప్రాంతాలు అభివృద్ధి సాధ్యమని పలువురు పేర్కొన్నారు. కూటమి నాయకులు నారాయణస్వామి, గిరిబాబు, గణపతి, బాలకృష్ణ, లక్ష్మయ్య, జ్యోతి, గ్రామాభివృద్ధి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

దుర్వాసన భరించలేం

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో కోమటివీధిలో కాలువలు పరిశుభ్రం చేయకపోవటంతో రహదారిపైకి మురుగునీరు చేరుతోంది. కాలువల్లో చెత్త తొలగించకపోవటంతో చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లుతోందని అధికారులు స్పందించి కాలువల్లో చెత్త తొలగించాలని కోరుతున్నారు. సిబ్బందిని పంపించి కాలువల్లో పూడికలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని శానిటరీ హెల్త్ అసిస్టెంట్ శేఖర్ తెలిపారు. -న్యూస్‌టుడే, పలాస



మూడు రోజులుగా దాహం.. దాహం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణంలో మూడు రోజులుగా కుళాయినీరు సరఫరా నిలిచిపోయింది. మోటార్లు మొరాయించడంతోనే పురాధికారులు నిస్సహాయంగా ఉండిపోయారు. దీంతో పలువురు బావి నీటిని, కొనుగోలు చేసిన నీళ్ల డబ్బాను వాడుతున్నారు. పాలకుల నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడంతో, నీరు ఇస్తారో లేదో తెలియడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. కాలం చెల్లిన మోటార్లు, ఏనాడో వేసిన విద్యుత్తు తీగలు, ఉపకరణాల పనులు, పర్యవేక్షణ లోపం, సిబ్బంది లేకపోవడం తరచూ నీటికి అవస్థ ఏర్పడుతోంది. ఈ విషయమై కమిషనర్ నల్లి రమేష్‌ను వివరణ కోరగా, మోటారు, స్టార్టర్ కాలిపోయాయని, వాటిని మరమ్మతు చేసి, గురువారం నీరు సరఫరా చేయగా, గంటలోనే మళ్లీ సమస్య పునరావృతమైందన్నారు. రెండు రోజుల్లో నీరు పూర్తిస్థాయిలో అందిస్తామని చెప్పారు.


కుళాయి వద్ద ఉంచిన ఖాళీ బిందెలు

నటుడు కుమార్ నాయక్‌కు పురస్కారం



ఈ ఏడాది తెలుగులో విడుదలైన ఎవడి సినిమాకు వాడే హీరో సినిమాలో ప్రతి నాయకుడి పాత్ర పోషించిన పలాసకు చెందిన కుమార్ నాయక్ ఉత్తమ విలన్ అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ చలన చిత్రోత్సవం సందర్భంగా ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకున్నట్లు చెప్పారు.
-న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

మహాలక్ష్మికి సహస్రనామార్చన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: తులా సంక్రమణ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని ఇచ్ఛాపురం పట్టణం, మండల పరిధిలో పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వేచ్ఛావతి అమ్మవారికి గురువారం ఉదయం అభిషేకాలు, సింధూరమర్దనం అనంతరం పూలమాలలతోనూ, రజత ఆభరణాలతోనూ అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి అభిషేక, పూజలు జరిపించారు. *ఒడిశా సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలను అనుసరించి ఆశ్వయుజ పౌర్ణమి నుంచి 9 రోజులు శ్రీగజలక్ష్మీదేవి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు రత్తకన్న నాయుడు వీధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. గజలక్ష్మీదేవి రూపాన్ని ఉదయం ప్రతిష్ఠించారు. ★ శ్రీజగన్నాథస్వామి దేవస్థానంలో కొలువుతీరివున్న శ్రీమహాలక్ష్మీదేవికి ఆశ్వయుజమాసం పౌర్ణమి (గౌరీ పౌర్ణమి) పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మహాలక్ష్మీదేవి సేవా భక్తబృందం ఆధ్వర్యంలో ఉదయం విశేషంగా పాలు, పంచామృతాలు, ఫలరసాలు, నదీజలాలతో అభిషేకం చేసి, అనంతరం 11 రకాల సుగంధ పరిమళ పుష్పాలతో సహస్రనామార్చన, కుంకుమార్చన జరిపారు.



ఘనంగా గౌరీ వ్రత పూజలు


డోకులపాడులోని పూజలో పాల్గొన్న మహిళలు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి, డోకులపాడు, చినవంక, పల్లిసారథి, సీతాపురం తదితర గ్రామాల్లో గురువారం గౌరీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. గౌరీ పౌర్ణమి వేడుకల్లో భాగంగా మహిళలు దీపధూప నైవేద్యాలు సమర్పించి నోములు పూజలు చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం



వజ్రపుకొత్తూరు, సోంపేట, కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఫీడర్, ఇతర నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

★ వజ్రపుకొత్తూరు మండలంలోని బెండి, నగరంపల్లి, మంచినీళ్లపేట, సీతాపురం, పెద్దబొడ్డపాడు, పెదబాడం తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ ఈఈ యజ్ఞేశ్వరరావు ప్రకటనలో తెలిపారు.

★ సోంపేట మండలంలోని మామిడిపల్లి ఫీడర్ పరిధిలో గొల్లవూరు, టి.శాసనాం, మామిడిపల్లి, ఉప్పలాం, సిరిమామిడి పంచాయతీ గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

★ కవిటి మండలంలోని భైరిపురం ఫీడర్ పరిధిలో భైరిపురం, డి.జి.పుట్టుగ, నెలవంక, కపాసుకుద్ది పంచాయతీలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నారు.

★ ఇచ్ఛాపురం పట్టణ పరిధిలోని ఏఎస్ పేట, పురుషోత్తపురంతో పాటు మండలం పరిధి కేదారిపురం, ముచ్చింద్ర, సన్యాసిపుట్టుగ, బూర్జపాడు, డొంకూరు తదితర గ్రామాలకు సరఫరా ఉండదు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు



అవగాహన కల్పిస్తున్న సెట్‌శ్రీ సూపరింటెండెంట్ రేఖ

హరిపురం (మందస), న్యూస్‌టుడే : జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని సెట్‌శ్రీ సూపరింటెండెంటు ఎల్.రేఖ అన్నారు. మందస మండలం బాలిగాంలోని ఆదిత్య కళాశాలలో సైబర్ నేరాలు, మహిళల అపహరణ తదితర అంశాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాటి జోలికి వెళ్తే కలిగే దుష్పరిణామాలను వివరించారు. మహిళలు అపరిచితుల నుంచి ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను ఆశ్రయించి రక్షణ పొందాలని సూచించారు. రాష్ట్ర యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

దాతల సహకారంతోనే అభివృద్ధి

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : దాతల సహకారంతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర పట్నాయక్ పేర్కొన్నారు. మడలం పరిధి కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలకు దివాకర్ సాహు దంపతులు రూ.20వేలు విలువ చేసే బల్లలు అందించారు. దాతలను నరేంద్ర అభినందించారు.

పారిశ్రామిక అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి


జీడి కర్మాగారంలో వివరాలు తెలుసుకుంటున్న వజ్జ బాబూరావు

పలాస, న్యూస్‌టుడే: పలాస కేంద్రంగా పారిశ్రామిక అభివృద్ధిలో వ్యాపారులంతా భాగస్వామ్యం కావాలని ఏపీ టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు కోరారు. పలాసలో పారిశ్రామిక వాడలో ఎస్ఎస్ఎస్ జీడి పరిశ్రమలో గురువారం పర్యటించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్లుగా జీడిపప్పు ఎగుమతులు, దిగుమతులుపై పరిశ్రమ అధినేత సంతోష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జీడి వ్యాపారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఎగుమతులు చేసేందుకు సిద్ధమయ్యేలా ప్రణాళిక తయారు చేస్తామని తెలిపారు.

ప్రగతి పరుగులు


ఇచ్ఛాపురం గ్రామీణం: తేలుకుంచిలో..

పలాస గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పలాస మండలంలోని చినంచల, కేదారిపురం, గురుదాసుపురం పంచాయతీలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు.

● పల్లె పండగతో గ్రామాల్లో పూర్వ వైభవంతో పాటు ప్రగతి చెందుతాయని నియోజకవర్గ జనసేన సమన్వయకర్త దాసరి రాజు పేర్కొన్నారు. మండలం పరిధి తేలుకుంచి, మశాఖపురం, బిర్లంగి గ్రామాలలో పల్లె పండగ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు.

● మండలంలోని సహలాలపుట్టుగ గ్రామంలో సీసీ రోడ్లకు మాజీ జడ్పీటీసీ రమేష్ శంకుస్థాపన చేశారు.


పలాస మండలం గంగువాడలో..

రాయితీపై వంట నూనెలు

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకిలో నేటి నుంచి రాయితీపై వంట నూనెలు తెల్లకార్డుదారులకు అందించనున్నట్లు తహసీల్దారు ఎం.సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఒక కార్డుకు లీటరు మాత్రమే ఇస్తారన్నారు. దీంతో పాటు రాయితీపై కందిపప్పు ధర కిలో రూ.146 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పామాయిల్ లీటరు రూ. 110, సన్‌ఫ్లవర్ నూనె రూ.124కు విక్రయిస్తున్నట్లు చెప్పారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

సారవకోట, న్యూస్‌టుడే: మానసిక ప్రశాంతతకు ధ్యానం ఉపకరిస్తుందని ఊడికలపాడు గ్రామానికి చెందిన ఆధ్యాత్మికవేత్త సనపల కరుణాకర్ పేర్కొన్నారు. కిన్నెరవాడ గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం జరిగిన ఆధ్యాత్మిక సత్సంగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంచుమోజు రామ్మోహనరావు, జి.సూర్యనారాయణ, యోగా చంద్రశేఖర్, బోయిన వెంకటరమణ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఆలయ అర్చకుడు కె.సిద్ధయ్యస్వామి, సర్పంచి పి.పద్మావతి పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని గ్రామీణ ఎస్సై ఈ.శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలం పరిధి లొద్దపుట్టిలో గ్రామస్థులతో గురువారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వాహనాలు ఇస్తే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసులు

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య: నందిగాం మండలంలో వంశధార ప్రధాన ఎడమ కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు సాగు నీరు అందించాలి. రైతులు ఇబ్బందులు తీర్చాలి. - జోగారావు, నవరజూనాపురం

సమాధానం: గొట్టా బ్యారేజీలో నీటి మట్టం తక్కువగా ఉంది. శివారు ప్రాంతాలకు సాగునీరు అందజేసేందుకు కృషి చేస్తాం. - భాస్కరరావు, ఏఈ, వంశధార శాఖ, నందిగాం

సమస్య: దిమిలాడ గ్రామంలో పైపులైన్లు అమర్చి వదిలేశారు. తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. - కృష్ణారావు, గ్రామస్థుడు

సమాధానం: సిబ్బందికి తెలియజేస్తాం. బోరుబావి తవ్వించి తాగునీరు అందజేస్తాం. - జీవన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, దిమిలాడ - న్యూస్‌టుడే, నందిగాం

సమస్య: పోలాకి గ్రామంలోని ఎస్సీ కాలనీలో కాలువల్లో వ్యర్థాలు పేరుకు పోవడంతో మురుగునీరు ప్రవహించక ఇబ్బందులు పడుతున్నాం. - చిన్నప్పన్న, స్థానికుడు

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, పోలాకి

వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించాలి


కోటబొమ్మాళి: సిబ్బందికి సూచనలిస్తున్న జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత

సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో సదుపాయాలు కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత పేర్కొన్నారు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి బాలికలు, బాలుర (బీసీ) వసతిగృహాలను జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత పరిశీలించి ఆహారం [illegible] చేశారు. సమస్యలు పునరావృతం కారాదని సిబ్బందికి సూచించారు. అనంతరం కోటబొమ్మాళి న్యాయస్థానంలో డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ అదాలత్ గురించి అధికారులతో మాట్లాడారు.


ఉప్పరపేటలో రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి


మెళియాపుట్టి మండలం శేఖరాపురంలో..

పల్లె పండగతో అభివృద్ధికి బాటలు

నరసన్నపేట (గ్రామీణం), నరసన్నపేట, పోలాకి, మెళియాపుట్టి, హిరమండలం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: గత పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని ప్రస్తుత కూటమి ప్రభుత్వ సారథ్యంలో పల్లె పండగతో అభివృద్ధి బాటలు పడుతున్నాయని నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. గురువారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు.


కోటబొమ్మాళి: చీపుర్లపాడు పంచాయతీలో..


నౌపడ పంచాయతీలో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో..

నిర్లక్ష్యం జాస్తి.. పనులు అసంపూర్తి..!


పునాదుల స్థాయిలోనే మోదుగువలసలోని భవనం

న్యూస్‌టుడే, ఎల్‌ఎన్‌పేట

రైతులు తాము పండించుకున్న పంటలను దాచుకొనేందుకు ప్రతి సచివాలయం పరిధిలో బహుళ ప్రయోజన గోదాంల నిర్మించాలని గత ప్రభుతం నిర్ణయించింది. ఎల్‌ఎన్‌పేట మండల పరిధిలో మొదటి విడతలో 12 సచివాలయాలకు గాను నాలుగింటిలో భవన నిర్మాణాలకు చర్యలు తీసుకుంది. ఇందుకు రూ.42 లక్షల నిధులు మంజూరు చేసింది. మోదుగువలస పునరావాస కాలనీ, తాయిమాంబపురం పునరావాస కాలనీ, చొర్లంగి, కరకవలస సచివాలయాల పరిధిలో అధికారులు స్థల పరిశీలన చేశారు. లక్ష్మీనర్సుపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఇదీ పరిస్థితి..

ఎల్‌ఎన్‌పేట మండలంలో కరకవలస సచివాలయం పరిధిలో దాదాపుగా పనులు పూర్తయ్యాయి. 70 శాతం బిల్లు కూడా మంజూరు చేశారు. కానీ ఆ భవనం నిరుపయోగంగా ఉంది. మోదుగువలస పునరావాస కాలనీలో పునాది స్థాయిలోనే నిర్మాణం వదిలేశారు. దీనికి రూ.6.72 లక్షల చెల్లింపులు జరిగాయి. చొర్లంగి గ్రామంలో 70 శాతం పనులు పూర్తిచేశారు. దీనికి సుమారు రూ.27 లక్షల బిల్లు మంజూరు చేశారు. దీనిని అసంపూర్తిగానే వదిలేశారు. తాయిమాంబపురంలో పనులే ప్రారంభించ లేదు.


కరకవలసలో చివరి దశలో నిలిచిన నిర్మాణం

దళారులే దిక్కు

గత పాలకులు కమీషన్ల కోసం ఇష్టానుసారం వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భవన నిర్మాణాలు పూర్తి చేసి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. రైతులు పండించిన పంటను దాచుకోవడానికి స్థలం లేక తక్కువ ధరకు దళారులకు అమ్ముకొనే పరిస్థితి నెలకొంది.

స్థల సేకరణ చేసినా..

మా సచివాలయం పరిధిలోని తాయిమాంబపురం పునరావాస కాలనీలో స్థల సేకరణ జరిగింది. కానీ ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి వెంటనే పనులు ప్రారంభించి రైతులకు భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

– వెలమల గోవిందరావు, సర్పంచి, ఎంబరాం

పనులు చేపట్టాలని కోరాం

మోదుగువలస, చొర్లంగి, తాయిమాంబపురం గ్రామాల్లో గోదాం పనులు చేపట్టాలని సంబంధిత గుత్తేదారులను కోరాం. నిర్మాణం చేసినంత వరకు బిల్లులు మంజూరు చేశాం. ఈ విషయమై జిల్లా అధికారులకు నివేదిక అందజేశాం.

– సింహాచలం, సీఈవో, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, ఎల్‌ఎన్‌పేట

సాయిబాబా ఆశయసాధనకు కృషి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా ఆశయసాధనకు కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నివాళి అని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కప్పిలి కామేశ్వరరావు అన్నారు. స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో గురువారం ఆయన సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దాలయ్య, ప్రొఫెసర్ కవయిత్రి, బి.చిన్నవాడు, జర్నలిస్టు బాబూరావు పాల్గొన్నారు.

తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం

సారవకోట, న్యూస్‌టుడే: అలుదు గ్రామంలో 1వ అంగన్‌వాడీ కేంద్రం గురువారం 10 గంటల వరకు తెరుచుకోలేదు. ఈ విషయాన్ని సెక్టార్ పర్యవేక్షకులు పుష్ప వద్ద ప్రస్తావించగా కార్యకర్త ఈనెల 16 నుంచి సెలవులో ఉన్నారు, కేంద్రం బాధ్యతలు అలుదు 2వ కేంద్రం కార్యకర్త పుష్పలతకు అప్పగించినట్లు చెప్పారు. అనంతరం కార్యకర్త పుష్పలత హాజరై తలుపులు తెరిచి సామగ్రి అందించడంతో సహాయకురాలు గౌరమ్మ వంట చేసి చిన్నారులకు ఆహారం అందించారు.

67 మందికి ఉద్యోగ అవకాశాలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు స్పందన లభించింది. నాలుగు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు నిర్వహించిన ఈ మేళాకు నియోజకవర్గ పరిధిలో 159 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అన్ని దశల పరీక్షల అనంతరం 67 మంది ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ తెలిపారు.

పారిశుద్ధ్యం.. అధ్వానం..!



హిరమండలం పరిధి గులుమూరు గ్రామం ఎగువ వీధిలో ఆలయం సమీపంలోని బోరుబావి వద్ద మురుగు సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ లేకపోవడంతో నీరు నిలిచి పోతుందని వాపోతున్నారు. దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శివాజీ మాట్లాడుతూ.. రూ.4.5 లక్షల నిధులు మంజూరయ్యాయని, సర్పంచి కోటేశ్వరరావు, పాలకవర్గంతో చర్చించి కాలువ నిర్మిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, హిరమండలం

ఎన్ని రోజులు ఈ అవస్థలు..?

టెక్కలిలోని శ్రీనివాసనగర్ ప్రధాన రహదారిలో బురదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. టెక్కలి- తొలుసూరుపల్లి రోడ్డు నుంచి పాత జాతీయ రహదారికి వెళ్లేవారు ఈ దారిలోనే రాకపోకలు చేస్తుంటారు. కాలువ వ్యవస్థ సరిగా లేక పోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. వర్షాలు కురిస్తే అవస్థలు రెట్టింపు అవుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. సమస్యపై మండల ఇంజినీరింగ్ అధికారి ఎస్.లక్ష్మంనాయుడు మాట్లాడుతూ.. వరదనీటి మళ్లింపునకు, కాలువ నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



నీరు రాదు.. ఇబ్బంది తీరదు..!



కోటబొమ్మాళి ఎస్సీ బాలికల వసతిగృహంలో కుళాయిలు నిరుపయోగంగా మారాయి. లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతుండటంతో వాటిని పూర్తిగా మూసేశారు. దీంతో కుళాయిలు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. విద్యార్థులు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు వాపోతున్నారు. ఈ విషయాన్ని సంక్షేమ అధికారిణి శ్రీదేవి వద్ద ప్రస్తావించగా సెలవులు కావడంతో బాగు చేయలేదని, కొత్త బిరడాలను అమర్చి, సమస్యను పరిష్కరిస్తామని స్పష్టంచేశారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

వెలుగులు.. అల్లుకున్న తీగలు



మెళియాపుట్టి మండలం పర్లాఖెముండి- పూండి రహదారిలోని కొసమాల సమీపంలో విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యంతో వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథాతో పాటు దీపాలు వేగంగా పాడయ్యే అవకాశముందని ఆ మార్గంలో రాకపోకలు చేసే వారు వాపోతున్నారు. మరో వైపు స్తంభాలకు పనికిరాని మొక్కలు అల్లుకుపోయాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని పలువురు కోరుతున్నారు. సమస్యను సిబ్బందికి తెలియజేసి చర్యలు తీసుకుంటామని ఏఈ రవి ప్రకాశ్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

విద్యుత్తు స్తంభం సరిచేశారు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: లుకులాం సమగ్ర రక్షిత నీటి పథకానికి సంబంధించిన 11కేవీ విద్యుత్తు లైన్‌లో జల్లువానిపేట సమీపంలో ఓ స్తంభం వద్ద నిప్పులు రాలుతుండేవి. దీనిపై 'అపాయం..అప్రమత్తత అవసరం' శీర్షికతో ఈ నెల 15న ఈనాడులో ప్రచురితమైన వార్తకు ఉర్లాం విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ బాలకృష్ణ స్పందించి సమస్యను పరిష్కరించారు.

తాగునీటి వెతలు తీరాయి

స్పందనకు వందనం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: నౌపడ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడేవారు. మండలంలోని పాఠశాలల్లో శుద్ధజల యంత్రాల పరిస్థితిపై ఈనెల 10న ఈనాడులో 'ప్లాంటు ఉన్నా..తప్పని పాట్లు..!' శీర్షికతో కథనం ప్రచురితమైంది. నౌపడలో ప్లాంటును హెచ్ఎం భానుప్రసాద్ బాగు చేయించారు. మండలంలో మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్ల గురించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఎంఈవో చిన్నవాడు తెలిపారు.


టెక్కలి పట్టణం: పట్టుమహాదేవి కోనేరు గట్టుపై అమ్మవారికి 11,116 గాజులతో అలంకరణ


హిరమండలం: గొట్టాబ్యారేజి కూడలిలో పూజలు చేస్తున్న మహిళలు


నరసన్నపేట: వరి పైరును భక్తిశ్రద్ధలతో తీసుకొస్తున్న మహిళలు

గౌరమ్మ.. చల్లగా చూడమ్మా

టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం గౌరీ పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహిళలు గౌరీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరులను కొలువు దీర్చి, తిరువీధి నిర్వహించారు. మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – న్యూస్‌టుడే బృందం


ఎల్‌ఎన్‌పేట: చింతలబడవంజిలో నందెన్నను ఊరేగిస్తున్న గ్రామస్థులు


నరసన్నపేట గ్రామీణం: ఉర్లాంలో కొమ్మల పూజలు నిర్వహిస్తున్న రైతులు


జలుమూరు: పెద్దదూగాంలో గౌరీ దేవి వ్రతంలో పాల్గొన్న భక్తులు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జలుమూరు, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి యు.చిన్నరాజులు అన్నారు. తలతరియా పంచాయతీ ఎర్రన్నపేట గ్రామంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎం ధనలక్ష్మి పాల్గొన్నారు.



రాయితీపై వంట నూనెలు

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకిలో నేటి నుంచి రాయితీపై వంట నూనెలు తెల్లకార్డుదారులకు అందించనున్నట్లు తహసీల్దారు ఎం.సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాయితీపై కందిపప్పు ధర కిలో రూ.146 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పామాయిల్ లీటరు రూ.110, పొద్దు తిరుగుడు పువ్వు నూనె రూ.124కు విక్రయిస్తున్నట్లు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలో 11 కేవీ టౌన్ ఫీడర్- 1, 2 లపై వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ జి.శంకరరావు తెలిపారు. తెంబూరు రోడ్డు, జిల్లా ఆసుపత్రి ప్రాంతం, గ్యాస్ గోదాం ప్రాంతం, సబ్ కలెక్టర్ కార్యాలయం, ఎన్టీఆర్ నగర్, శ్రీనివాసనగర్, పాత జిల్లా ఆసుపత్రి ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

సారవకోట: మానసిక ప్రశాంతతకు ధ్యానం ఉపకరిస్తుందని ఊడికలపాడుకు చెందిన ఆధ్యాత్మికవేత్త సనపల కరుణాకర్ పేర్కొన్నారు. కిన్నెరవాడలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం జరిగిన ఆధ్యాత్మిక సత్సంగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కె.రామ్మోహనరావు, జి.సూర్యనారాయణ, యోగా చంద్రశేఖర్, బి.వెంకటరమణ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఆలయ అర్చకుడు కె.సిద్ధయ్య స్వామి, సర్పంచి పి.పద్మావతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

సారవకోట, న్యూస్‌టుడే: పెద్దలంబ అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దారు విజయలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల హాజరు, పౌష్టికాహార నిల్వలను పరిశీలించారు. పట్టాదారు పాసుపుస్తకాలు రావడం లేదని గోవర్ధనపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు క్షేత్ర పరిశీలన చేశారు. అనంతరం బొంతు పీహెచ్‌సీని సందర్శించారు.



స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్‌పై హర్షం

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్వర్ణకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించడంతో స్వర్ణకార సంక్షేమ సంఘం, తెదేపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక స్వర్ణకార సంక్షేమ సంఘ భవనంలో విజయోత్సవం నిర్వహించారు. ప్రతినిధులు రామకృష్ణ, గోవిందరావు, చిట్టిబాబు, సతీష్, రామచంద్రరావు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

నిఘా నేత్రాలతో భద్రత

సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసు శాఖ అడుగులు


నరసన్నపేట కళాశాల కూడలి

– న్యూస్‌టుడే, నరసన్నపేట, జలుమూరు

నేరాల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరుగుతుండగా, పోలీసు శాఖ వద్ద అందుకు అనుగుణంగా మౌలిక వసతులు అందుబాటులో లేక నిందితుల గుర్తింపు కష్టంగా మారింది. సిబ్బంది కొరత, పని ఒత్తిడి నేపథ్యంలో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వారిని గుర్తించేందుకు పోలీసు శాఖ ఎన్ని అధునాతన విధానాలు అవలంబించినా, ప్రాథమిక సాంకేతిక సౌలభ్యం లేకపోవడం కలవరపెడుతోంది. ముఖ్యంగా ప్రారంభంలోనే గుర్తింపు కోసం సీసీ కెమెరాలు అవసరం. గత దశాబ్ద కాలంగా వీటి ఏర్పాటు నత్తనడకన సాగుతోంది. అరకొరగా ఉండటంతో నిందితుల గుర్తింపులో జాప్యం జరుగుతోంది.

ఒకటి రెండు చోట్ల మాత్రమే

నరసన్నపేట పట్టణంలో ప్రధాన రహదారితో పాటు మార్కెట్‌లో ఒకటి రెండు చోట్ల మాత్రమే సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. పలు వ్యాపార సంస్థలు, దుకాణాలు, దేవాలయాలు, బహుళ అంతస్తుల భవనాల వద్ద ప్రైవేటుగా అందుబాటులో ఉన్నా.. వాటి ఫలితాలు అంతంత మాత్రమే.


వంశధార కార్యాలయం సమీపంలో అమర్చిన సీసీ కెమెరాలు

603 ప్రాంతాల్లో..

ముఖ్య కూడళ్లు, రహదారుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసు శాఖ సన్నద్ధమవుతోంది. నేరాలు, ప్రమాదాలకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు కేవలం 55 ప్రాంతాల్లో మాత్రమే ఉండగా, కొత్తగా మరో 603 ప్రాంతాల్లో ఏర్పాటుకు పోలీసుశాఖ ప్రతిపాదనలు చేసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ ఏర్పాటు చేయనున్నారు.

ఎంతో ఉపయోగం

- నరసన్నపేటకు చెందిన ఓ యువకుడిని హత్యచేసి శ్రీముఖలింగం నదిలో పాతపెట్టిన వైనాన్ని రహదారిపై అమర్చిన సీసీ కెమెరాల సహాయంతో ఛేదించారు.
- మడపాం టోల్‌ప్లాజా వద్ద జరిగిన ప్రమాదాలను, జమ్ము కూడలి వద్ద రైసుమిల్లుల్లో దొంగతనాలను వీటితోనే గుర్తించారు.
- గతేడాది ఇందిరానగర్‌లో ఓ వైద్య దంపతుల ఇంట్లో జరిగిన భారీ చోరీకి సంబంధించి, నిఘా నేత్రాలు లేకపోవడంతో నిందితుల గుర్తింపులో జాప్యం జరిగింది.

నిందితుల గుర్తింపు సులభం

సీసీ కెమెరాల సాయంతో నిందితులను గుర్తించడం సులభతరం. తక్కువ సమయంలో కేసులు ఛేదించేందుకు ఇవి తోడ్పడతాయి. ఈ మేరకు నరసన్నపేట సర్కిల్ పరిధిలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జె.శ్రీనివాసరావు, సీఐ, నరసన్నపేట

సంఘాల ప్రగతికి చేయూత

టెక్కలి పట్టణం, సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల ప్రగతికి ప్రభుత్వం చేయూత అందిస్తోందని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. టెక్కలిలో డ్వాక్రా మహిళ అల్లు లలిత ఏర్పాటు చేసిన మినీ ఆయిల్‌మిల్, పసుపు, కారం తయారీ యూనిట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. డీపీఎంలు నారాయణరావు, నాగలక్ష్మి పాల్గొన్నారు. ● స్వయం సహాయ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెట్ ద్వారా విక్రయించడానికి సెర్ప్ శాశ్వత చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండలం సీతానగరంలో స్వయం సహాయక సభ్యులు తయారీ చేస్తున్న కొండ చీపుర్లను ఆయన పరిశీలించారు.


సీతానగరంలో కొండ చీపుర్లను పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ కిరణ్‌కుమార్

టెట్‌కు 67 మంది గైర్హాజరు

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 67 మంది గైర్హాజరయ్యారు. స్థానిక కోర్ టెక్నాలజీ కేంద్రంలో గురువారం జరిగిన పరీక్షకు మొత్తం 660 మందికి గాను 593మంది అభ్యర్థులు హాజరయ్యారని డిపార్ట్‌మెంటల్ అధికారి దాలినాయుడు తెలిపారు.

వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం

టెక్కలి పట్టణం, నందిగాం, కోటబొమ్మాళి, నరసన్నపేట, పోలాకి: వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని వక్తలు పేర్కొన్నారు. గురువారం పలుచోట్ల ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వేటగాడి నుంచి పండితుడిగా వాల్మీకి ఎలా మార్పు చెందారో వివరించారు.


కోటబొమ్మాళి: ఊడికలపాడు రామమందిరంలో..


నరసన్నపేట: మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లత

అయ్యప్ప భక్తులకు ప్రత్యేక బస్సులు: టెక్కలి పట్టణం: శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ ప్రత్యేకంగా అద్దె బస్సుల సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. టెక్కలి నుంచి ప్రముఖ క్షేత్రాలను దర్శించేలా ప్యాకేజీలు ఉన్నాయన్నారు. వివరాలకు డిపోలో సంప్రదించాలన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి



ప్రభుత్వ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని చింతపాలెం, పోలీసు క్వార్టర్స్‌లోని ఎచ్చెర్ల ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలను వివరించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

తెరపై ఈనాడు

★ కీర్తన: విశ్వం ★ కిరణ్: సత్యం సుందరం ★ కిన్నెర సినిమాక్స్: ఇద్దరు ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: జనక అయితే గనక ★ మారుతి: లవ్ రెడ్డి

– న్యూస్‌టుడే, అరసవల్లి


విద్యా వనరుల కేంద్రం పరిశీలన

గార, న్యూస్‌టుడే: గార మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి ఎస్. తిరుమల చైతన్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు ఎన్.రామకృష్ణ, వినోదినిలతో కేంద్రం నిర్వహణకు సంబంధించి ఆయన మాట్లాడారు. కార్యాలయంలో ఆయన దస్త్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఉద్యోగోన్నతుల్లో నిబంధనలు పాటించండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రవాణాశాఖలో ఉద్యోగోన్నతుల విషయంలో ఉన్నతాధికారులు నిబంధనలు పాటించాలని జిల్లా దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎ.ప్రతాప్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో జిల్లా దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులతో కలిసి గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రవాణాశాఖలో క్లాజ్ రూల్ అమలు చేయడంతో ఎస్సీ ఎస్టీలకు ఉద్యోగోన్నతుల్లో అన్యాయం జరుగుతుందన్నారు. నాయకులు భరత్‌భూషణ్‌రాజు, దుర్గారావులు ఉన్నారు.

గడ్డి మందు తాగి మృతి



బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ మండలంలోని నీలాదేవిపురానికి చెందిన కంచిపల్లి తవిటినాయుడు(44) బుధవారం గడ్డి మందు తాగాడు. ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ గురువారం వేకువ జామున మృతి చెందినట్లు ఎస్సై ఎం.ప్రవళ్లిక తెలిపారు. నాలుగేళ్ల కిందట రహదారి ప్రమాదానికి గురవ్వడంతో అతడు మతిస్థిమితం కోల్పోయి విచిత్రంగా ప్రవర్తించేవాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారని తెలిపారు. బుధవారం భార్య ఇంట్లో లేకపోవడంతో అతడు గడ్డి మందు తాగినట్లు, చుట్టుపక్కల వాళ్లు గమనించి వెంటనే శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి వైద్యం అందించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. అతడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు కేసుల్లో ఐదుగురికి జైలు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలంలో వేర్వేరు చోట్ల జరిగిన రెండు చోరీ కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ శ్రీకాకుళం ఒకటో అదనపు మెజిస్ట్రేట్ జడ్జి తీర్పు చెప్పినట్లు ఎస్సై కిశోర్ వర్మ తెలిపారు. రాజాం మండలం గురవాం గ్రామానికి చెందిన కప్పిలి సతీష్ 2018లో రెండు ఇళ్లలో బంగారం, వెండి వస్తువులను దోచుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో కేసు నమోదు చేసి ఎస్సై చిన్నంనాయుడు దర్యాప్తు చేశారు. నిందితుడిని పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నేరం నిరూపితం కావడంతో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధించడంతో అంపోలులోని జిల్లా కేంద్ర కారాగారానికి గురువారం తరలించామని ఎస్సై పేర్కొన్నారు. భైరిలోని ఓ కర్రల మిల్లులో జరిగిన దొంగతనం కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నాయస్థానంలో నలుగురికి ఆరు నెలల శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

శ్రీకాకుళం నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పింది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది అలసత్వం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. వీధుల్లో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగునీరు రహదారుల పైనే పారుతోంది. పారిశుద్ధ్య పనులకు సంబంధించి ఏటా రూ.కోట్లలో ప్రజాధనం వెచ్చిస్తున్నా ఫలితం ఉండట్లేదు.



రెడ్డికవీధిలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

అస్తవ్యస్తం.. అంతా చెత్తమయం..!

నగరంలో గాడితప్పిన పారిశుద్ధ్య నిర్వహణ

● ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని డివిజన్లలో సిబ్బంది ప్రతి రోజూ ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించాల్సి ఉన్నా అమలుకు నోచుకోవట్లేదు. కాలనీలు, ప్రధాన రహదారుల్లో మినహా శివారు ప్రాంతాలను పట్టించుకునేవారే కరవయ్యారు. దీంతో స్థానికులు ఇళ్లలోని వ్యర్థాలను రహదారుల పక్కన, ఖాళీ స్థలాల్లో వేస్తున్నారు. దాన్ని సైతం రోజుల తరబడి తొలగించకపోవడంతో ఆయా ప్రాంతాలు డంపింగ్ యార్డుల్లా మారుతున్నాయి. ఫలితంగా దోమలు పెరిగి నగరవాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో పనికి రాని మొక్కలు, నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో సమస్యకు పరిష్కారం దొరకట్లేదు.

నగరంలో వివరాలిలా...

డివిజన్లు	: 50
జనాభా	: 1.86లక్షలు
కుటుంబాలు	: 55,471
పారిశుద్ధ్య పనులకు ఏడాదికి చేస్తున్న ఖర్చు	: రూ.8.50 - 9 కోట్లు
నిత్యం సేకరించే చెత్త	: 60 నుంచి 65 మెట్రిక్ టన్నులు

రూ.కోట్ల ప్రజాధనం వృథా..

తడి, పొడి చెత్తను వేరు చేసి సద్వినియోగం చేసుకోవాల్సిన సంగతి విస్మరించారు. వ్యర్థాల నిర్వహణకు విడతలవారీగా రూ.152 కోట్లతో తండేంవలస డంపింగ్‌యార్డులో మౌలిక సదుపాయాలు కల్పించారు. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక పోతుండటంతో ప్రజాధనం వృథా అవుతోంది. ● నగర పరిధిలో ఇప్పటి వరకు కిలో వర్మీ ఎరువు కూడా చేయలేదు. చెత్త నిల్వకు ప్రభుత్వం మంజూరు చేసిన 24 ఎకరాల స్థలంలో నిత్యం సేకరించే వ్యర్థాలను యథావిధిగా పడేస్తున్నారు. ఇదే పరిస్థితి మరో మూడేళ్లు కొనసాగితే యార్డు మొత్తం నిండిపోయే పరిస్థితి నెలకొంది

కార్యాచరణ రూపొందిస్తాం...

నగరంలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు చేపడుతున్నాం. కాలువల్లో పూడిక తొలగింపు, దోమల నివారణపై దృష్టి సారిస్తాం. వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు జరిగేలా చూస్తాం.

– పి.వి.వి.డి.ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

వాల్మీకి జయంతి

కలెక్టరేట్(శ్రీకాకుళం), నేరవార్తావిభాగం, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: జిల్లాలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటానికి జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌వో అప్పారావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీటీసీడబ్ల్యూవో అనూరాధ, తదితరులు పాల్గొన్నారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ● నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)లో వాల్మీకి జయంతి నిర్వహించారు. బీఆర్‌ఏయూ విశ్రాంత అధ్యాపకులు జీఏ శర్మ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.● వాల్మీకి చరిత్రను ప్రతి ఒక్కరూ ఆదర్శనీయంగా తీసుకోవాలని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.నాగేంద్ర అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో రమేష్ సాహూ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఘనంగా గౌరీ పౌర్ణమి పూజలు



రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల, ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలంలోని నవభారత్ కూడలి సమీపంలో కుంచాలకూర్మయ్యపేట వద్ద శ్రీచక్రపురంలో గురువారం గౌరీ పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీచక్రపురం పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి వచ్చిన మహిళలు, భక్తులతో 1,001 శ్రీచక్రాల ముందు సామూహిక కుంకుమార్చన చేయించారు.● ఆమదాలవలస మండలంలోని కొత్తవలస, శ్రీనివాసాచార్యులపేట, అక్కులపేట, పొన్నాంపేట తదితర గ్రామాల్లో గౌరీ పౌర్ణమి సందర్భంగా గౌరీదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ● సరుబుజ్జిలి మండలంలోని షళంత్రి గ్రామంలో నందెన్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మంచంపైన నందీశ్వరుడిని, గౌరీదేవిని పెట్టి భక్తులు పూజలు చేశారు.

మురుగుతో అవస్థలు

శ్రీకాకుళం నగరం రామలక్ష్మణ కూడలి సమీపంలోని డీసీసీబీ కాలనీలో సీసీ కాలువలు లేక మురుగునీరు రహదారుల పక్కన నిల్వ ఉండిపోతోంది. దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ నిధుల లభ్యత ఆధారంగా ఆ ప్రాంతంలో సీసీ కాలువల నిర్మాణం చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



రహదారిలో గోతులు



ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి మండలం వెళ్లే రహదారిలో గోతులు ఏర్పడటంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆమదాలవలస మండలం చెవ్వాకులపేట వద్ద ఇసుక ర్యాంపును గత వైకాపా పాలనలో నిర్వహించారు. భారీ వాహనాలతో ఇసుక తరలిపోవడంతో రహదారి దెబ్బతిని గోతులు ఏర్పడ్డాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ ఆంజనేయ నాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రహదారి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

కుక్కలు బాబోయ్..!

శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ పరిసర ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రీపగలూ తేడా లేకుండా గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. ఇటీవల పలువురు చిన్నారులు కుక్కకాట్లతో ఆసుపత్రి పాలయ్యారు. అధికారులు సమస్య పరిష్కారానికి స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ కుక్కల సంతతి నివారణకు చర్యలు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



పేరుకుపోయిన చెత్త..!



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామంలోని కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటి బారిన పడిన స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాడేల రమణ కోరారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ రామారావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



దూసిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస గ్రామీణం, శ్రీకాకుళం గ్రామీణం, గార, జి.సిగడాం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని దూసి, వంజంగిపేట పంచాయతీల్లో అధికారులు నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దూసి పంచాయతీలో రూ.56.60 లక్షలతో, వంజంగిపేట పంచాయతీలో రూ.20.70 లక్షలతో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. ఎంపీడీవో వెంకటరావు, తెదేపా మండల అధ్యక్షుడు నూక రాజు, జిల్లా ప్రచార కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గార మండలం శ్రీకూర్మం, బలరాంపురం, గొంటి, శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని కల్లేపల్లి, పీజీ పేట, నైర, పొన్నాం, బట్టేరు గ్రామాల్లో రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన, భూమిపూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో శైలజ, కూటమి, మూకళ్ల శ్రీను, కైబాడి రాజు, కోరాడ వెంకటరావు, ప్రభాకరరావు, గిరి, బరాటం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ●కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెదేపా సీనియర్ నాయకులు బాలబొమ్మ వెంకటేశ్వరరావు, పలిశెట్టి సూర్యనారాయణ అన్నారు. జి.సిగడాం మండలం పాలకండ్యాం, ఆనందపురం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, భాజపా మండల అధ్యక్షుడు వజ్జిపర్తి రఘురాం తదితరులు పాల్గొన్నారు.



నైర గ్రామంలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అంతిమ యాత్రకూ అవస్థలే

● శ్మశానవాటికలకు రహదారి లేక ఇబ్బందులు

● పంట పొలాలు, ముళ్ల పొదల్లో నుంచి మృతదేహాలను తరలిస్తున్న వైనం

అంతిమ యాత్రకు ఆమదాలవలస నియోజకవర్గంలో అవస్థలు తప్పడం లేదు. ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లో చాలా గ్రామాలకు శ్మశానవాటికకు వెళ్లేందుకు దారి లేక చెరువు గట్లు, ముళ్ల పొదల్లో నుంచి, పంట పొలాల్లో గట్లు, వరి చేలలో నుంచి స్వర్గధామానికి తీసుకువెళ్లాల్సి వస్తుంది. కొన్నింటిలో సరైన సదుపాయాలు కూడా లేవు. కొన్ని చోట్ల నదీతీర ప్రాంతాల్లోనే అంత్యక్రియలు జరిపించాల్సి వస్తుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి శ్మశాన వాటికలకు రహదారులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, బూర్జ, పొందూరు



బూర్జ: చీడివలసలో పంట పొలాల్లో నుంచి దహన సంస్కారాలకు మృతదేహాన్ని తీసుకువెళ్తున్న బంధువులు

నియోజకవర్గంలో పరిస్థితి

ఆమదాలవలస: మండలంలోని ఈసర్లపేట గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లాలంటే చెరువు గట్లు, ముళ్ల పొదల మధ్యలో నుంచి శవాన్ని తీసుకొని వెళ్తున్నారు. రామచంద్రాపురం, పొన్నాంపేట, ఆనందపురం, చెవ్వాకులపేట, దివంజిపేట, సైలాడ, కుమ్మరిపేట, సిరిసింపేట, దండేంవలస, కొర్లకోట ఎస్సీ కాలనీలతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పంటలు లేని సమయాల్లో పొలాల మీదుగా వెళ్తున్నారు.

బూర్జ: మండలంలోని చీడివలస, కొండపేట, తుడ్డలి గ్రామాల ప్రజలు ఎవరైనా మృతి చెందితే వారు శవాన్ని పంట పొలాల్లో నుంచి శ్మశానవాటికకు తీసుకువెళ్తున్నారు. లాభాం, గుత్తావల్లి, నారాయణపురం, చిలంకాం, కాఖండ్యాంతో పాటు నాగావళి నదీతీర ప్రాంతాల్లోని గ్రామల ప్రజలు నది ఒడ్డున దహన సంస్కారాలు చేపడుతున్నారు.

పొందూరు: మండలంలోని తండ్యాం, లక్ష్మీపేట, బొడ్డేపల్లి, పొందూరుల్లో స్వర్గధామాలకు దారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాపాక, పొందూరు, కొంచాడ గ్రామాల్లో రుద్రభూములు పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో ఆయా పల్లెల్లో ఎవరైనా మృతి చెందితే ఉన్న కొంత ఖాళీ స్థలంలో దహన సంస్కారాలు చేపడుతున్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని షళంత్రి, సుబ్బుపేట, డకరవలస, సుభద్రాపురం గ్రామాల్లో స్వర్గధామాలకు రహదారి లేక మృతదేహాలను తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పురుషోత్తపురం, అల్మాజీపేట, పకీర్‌సాహెబ్‌పేట, సీతారాం కాలనీ, యరగాం, తెలికిపెంట, చినకాకితాపల్లి, అగ్రహారం, పాతపాడు, తెలికిపెంట, పెద్ద సవళాపురం, పెద్ద మాలపేట గ్రామాల ప్రజలు వంశధార నదీ తీరాన మృతులకు దహన సంస్కారాలు చేపడుతున్నారు.

దారులు ఏర్పాటు చేస్తాం

శ్మశానవాటికకు దారులు లేవన్న సంగతి ఇంతవరకూ మా దృష్టికి రాలేదు. మేము కొత్తగా బదిలీపై వచ్చాం. అన్ని గ్రామాలు పరిశీలించి సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించి ఆయా గ్రామాల్లో శ్మశానవాటికల పరిస్థితిపై చర్చించి వాటికి రహదారులు నిర్మించే విధంగా చర్యలు చేపడతాం. వాటిల్లో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.

– వెంకటరావు, మన్మథరావు, పావని, తిరుపతిరావు, ఎంపీడీవోలు, ఆమదాలవలస, పొందూరు, సరుబుజ్జిలి, బూర్జ మండలాలు

విద్యతోనే పేదరిక నిర్మూలన

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సూర్యచంద్రరావు పేర్కొన్నారు. కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. అకడమిక్ సమన్వయకర్త సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ సమన్వయకర్త ఎస్.పద్మావతి, వృక్షశాస్త్ర విభాగాధిపతి రుద్రమరాణి, అర్థశాస్త్ర విభాగాధిపతి ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లు పని తీరు మెరుగుపరుచుకోవాలి

శ్రీకాకుళం సాంస్కృతికం: ఇంజినీర్లు ఎప్పటికప్పుడు పని తీరు మెరుగుపర్చుకోవాలని జిల్లా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముని శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ హోటల్‌లో జిల్లా లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సివిల్ ఇంజినీర్లుతో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు మధుబాబు, పి.జగదీష్, దుంగ సుధాకర్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గార: సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారిణి డి.పద్మావతి అన్నారు. గార మండలం వత్సవలస పంచాయతీ పరిధిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

బూర్జ: మండలంలోని నారాయణపురం వద్ద ఇటీవల జరిగిన గొడవపై గుత్తావిల్లికి చెందిన సనపల సురేష్‌కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, కౌంటర్ దాఖలైన నీలాదేవిపురానికి చెందిన కోడి గోవిందరావు, సురేష్, తదితర వ్యక్తులపై నమోదు అయిన కేసు దర్యాప్తు విషయమై గురువారం నారాయణపురంలో డీఎస్పీ డీఎన్‌వీ ప్రసాద్ పర్యటించారు. ఇక్కడి ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించి స్థానికులను విచారించి వివరాలు సేకరించినట్లు ఎస్సై ఎం.ప్రవళ్లిక తెలిపారు.

అవీ..ఇవీ..అన్నీ

ఆర్థిక సాయం అందజేత

కలెక్టరేట్(శ్రీకాకుళం): శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విజయనగరం జిల్లా ఎస్.కోట మండలానికి చెందిన ఆర్.శివాజీకి జస్ట్ డూ ఇట్ బృందం రూ.40,000 ఆర్థిక సాయం అందించింది. ఆ నగదును నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని డీఈవో ఎస్.తిరుమల చైతన్య చేతుల మీదుగా గురువారం అందజేశారు. జస్ట్ డూ ఇట్ సభ్యులు ఎ.సంజీవరావు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



శ్రీకాకుళం సాంస్కృతికం: శ్రీకాకుళం నగరంలోని గోవిందనగర్‌లో ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి చరణ్ శంకర్ నిర్వహణలో అమ్మవారికి అభిషేకం, విశేష పుష్పాలంకరణ, కుంకుమార్చన పూజలు జరిపారు. 108 మంది మహిళలతో కలశాల ఊరేగింపు నిర్వహించారు.

సిబ్బంది సక్రమంగా పనిచేయాలి

ఆమదాలవలస గ్రామీణం: ఆమదాలవలస నియోజకవర్గంలో సచివాలయ సిబ్బంది సక్రమంగా పనిచేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. గురువారం దూసి పంచాయతీ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వారి పని తీరును అడిగి తెలుసుకున్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, గ్రామీణం: శ్రీకాకుళం నగరంలోని బలగ కూడలిలో సనపల సురేశ్ అనే వ్యక్తిపై బుధవారం దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇదే ఘటనకు సంబంధించి సనపల సురేష్‌పై అశోక్ కుమార్, సాయితేజ అనే ఇద్దరు ఫిర్యాదు చేసినట్లు శ్రీకాకుళం గ్రామీణ పోలీసుస్టేషన్ ఏఎస్సై కె. నారాయణరావు గురువారం తెలిపారు. సురేష్ తమను కారుతో ఢీకొట్టి వెళ్లిపోయినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు.

జూదరుల అరెస్టు

పొందూరు: మండలంలోని బురిడికంచరాం సమీపంలో తోటలో జూద శిబిరంపై గురువారం పొందూరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అయిదుగురు జూదరులను పట్టుకున్నారు. పోలీసులకు అందిన సమాచారంతో ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేసి అయిదుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

భారీ వర్షంతో రైతుల ఆందోళన

సరుబుజ్జిలి: మండలంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పొలాల్లో నీరు ఎక్కువగా చేరడంతో వరి పంట దెబ్బతింటుందని చెబుతున్నారు. గాలికి స్వర్ణ రకం పైరు నేలమట్టం అయ్యిందని లబోదిబోమంటున్నారు. భారీ వర్షంతో పొలాల్లో నీరు చేరాయి. సుమారు 2 గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినట్లు రైతులు చెబుతున్నారు.

సాగునీరు అందించండి

జి.సిగడాం: జి.సిగడాం మండలంలో మడ్డువలస ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని పలు గ్రామాల రైతులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, దవళపేట, సీతంపేట, టంకాలదుగ్గివలస, పాలకండ్యాం, మెట్టవలస, నిద్దాం, పెంట, నాగులవలస గ్రామాలకు మడ్డువలస ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందక ప్రతి ఏడాది వరి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఇసుక అక్రమ రవాణాలో మీ వాటా ఎంత ఇచ్చారో చెప్పాలని తెదేపా నియోజకవర్గ అధికార ప్రతినిధి తమ్మినేని విద్యాసాగర్ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ప్రశ్నించారు. గురువారం ఆమదాలవలస తెదేపా కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కూన రవికుమార్, కార్యకర్తలు లారీకి ఇంతని తీసుకుంటున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు బోర గోవిందరావు, తెదేపా నాయకులు ఇంజరాపు విశ్వనాథం, జి.డి.ప్రసాద్, నాగళ్ల మురళీ, గుర్రయ్యలతో పాటు నాయకులు పాల్గొన్నారు.